
Sree Mullapudi Venkatarayudu Library
TANUKU. W.G.Dt. A.P.

# మనిషిగా మారిన మనిషి

(పెద్ద కథ)

కందుకూరి వెంకటమహాలక్ష్మి




**మరచెంబు గ్లాసు కిటికీలో పెట్టి, దుప్పటి తీసి పడుకున్న తండ్రి భుజాల దాకా కప్పి వెనుదిరిగింది ఆరతి.**

"ఆరతీ!" అన్న గోపాలం గారి పిలుపుకి తిరిగి చూసి "ఏం నాన్నా! ఇంకా పడుకో లేదా?" అంటూ మంచం దగ్గరికి వెళ్ళింది. కొద్దిగా వెనక్కి జరిగి కూర్చోమన్నట్లు చేత్తో సైగ చేశారు గోపాలం గారు కళ్ళు మూసుకునే! తండ్రి ప్రక్కన మౌనంగా కూర్చుని ఆప్యా యంగా ఆయన గుండెల మీద చెయ్యి వేసిన ఆరతి మస్తిష్కంలో ఆలోచనలు శరవేగంతో దౌడుతీయసాగాయి.

తండ్రి తనని పిలుస్తాడని తెలుసు ఎందుకో కూడా తెలుసు. నిజానికి ఈ పిలుపు కోసం ఆఫీసు నుంచి వచ్చిన దగ్గర నుంచీ ఎదురుచూస్తోంది. తమ్ముడూ, చెల్లెలూ నిద్రపోయే వరకు ఆగి సావకాశంగా మాట్లాడాలని ఈ టైములో పిల్చివుంటారనుకుంది.

నిన్న సాయింత్రం సాగర్ చెప్పాడు. "ఆరతీ! రేపు మీ ఇంటి కొచ్చి మీ నాన్నగారితో మన పెళ్ళి విషయం మాట్లాడతా"నని. సాగర్ కొద్ది రోజుల క్రితం తనని పెళ్ళి చేసుకుంటానని అడిగినప్పుడు అతని దగ్గర ఏ విషయం దాచకుండా, తన యింటి పరిస్థితి వివరంగా చెప్పింది.

తల్లిలేని ఆ యింటికి తనే పెద్ద దిక్కని రిటైర్‌మెంట్‌కి అయిదేళ్ళ ముందే పక్షవాతం రావడంతో

తండ్రి ఉద్యోగం వదిలేసి యింట్లో మంచం పట్టివున్నాడని, అందుకే తండ్రి ఆఫీసులో తనకి ఈ ఉద్యోగం వచ్చిందనీ, పదో క్లాసు రెండు సార్లు తప్పిన చెల్లెలు "చదువంటే యిష్టం లేదు, పెళ్ళి చేసుకుంటా"నని ఖచ్చితంగా చెప్పేసిందనీ, ఇవి కాక డిగ్రీలో చేరిన తమ్ముడు వున్నాడనీ, వీళ్ళిద్దరి బాధ్యత, తండ్రి బాధ్యత తనపైనే వున్నాయనీ, మా నాన్నకొచ్చిన పి.ఎఫ్., నా జీతం తప్ప మాకు ఏ ఆధారం లేదని, నాన్నకి వైద్యం చేయిస్తూ ఇల్లు గడపడమే చాలా కష్టంగా వుందనీ, ఇన్ని బరువు, బాధ్యతల్ని కాదని నా సుఖాన్ని నేను చూసుకుని ఆ ఇంటిలోంచి బైటికి వచ్చేస్తే వాళ్ళ బ్రతుకులేం కావాలి? వేరే ఆధారం లేని వాళ్ళనెలా వదిలేసి రాగలను? వాళ్ళంతా నా జీతం మీదే బ్రతుకుతున్న వాళ్ళు.

ఇప్పుడు చెప్పు నా మీద వున్న ఇన్ని బరువు, బాధ్యతల్ని కాదని నిన్ను పెళ్ళి చేసుకుని ఎలా రాగలను చెప్పు అన్నదానికి సాగర్ "ఆరతీ! నువ్వు నా దానివైనప్పుడు నీ బాధ్యతలు నావి కావా? నీ కష్టసుఖాలన్నీ నావికావా? నాకు నా అన్నవాళ్ళెవ్వరూ లేరు. కాబట్టి యిద్దరం కలిసి ఆ బాధ్యతల్ని పంచుకుందాం. ఇవి పెళ్ళి ముందు ముఖస్తుతి కబుర్లు, ప్రేమ పాఠాలు కావు. ఆఫీసులో పరిస్థితి ఎంత ఘోరంగా వుందో చూస్తున్నాను. ఇదే పెళ్ళయిన ఆడదంటే ఇంత మూర్ఖంగా ప్రవర్తించరు. అయినా ఇద్దరం ఒకే ఆఫీసులో వున్నాం కాబట్టి కాస్త కాకపోతే కాస్తయినా వెర్రివేషాలెయ్యడానికి జంకుతారు" అంటూ తనకి ధైర్యం చెప్పాడు.

ఆఫీసులో చేరిన రోజునుంచీ ఆరతికి సాగర్ ఉంటే ఎంతో ధైర్యాన్నిస్తోంది. సాగరే వుండి వుండకపోతే ఆ ఆఫీసులో ఉద్యోగం చెయ్యలేక, ఏనాడో మానేసి వుండేది. ఆమె అందం, యౌవ్వనం ఆఫీసులో ప్రతి ఒక్కరికి అలుసుగానే వుండేది. వారి ఆకలి చూపులు, ఇకిలింతల మధ్య నిలబడగలిగిందంటే దానికి కారణం సాగర్ అనే చెప్పాలి. ఆరతి వయసు మనుమరాళ్ళున్న ముసలి వాళ్ళు కూడా ఆరతిని నమిలి మింగేసేలా చూస్తుంటే ఆమెకి ఆఫీసంటే భయం పట్టుకుంది. వీరందరినుంచీ తప్పించుకున్నా, మరో రెండాకులు ఎక్కువ చదివిన మేనేజర్ బారినుంచి తప్పించుకోడం మాత్రం దినదినగండంగానే వుంది.

వయస్సులో చిన్నవాడే, పెళ్ళికాలేదు. ప్రఖ్యాతి గాంచిన విటుడని పేరుమోసాడు. విచ్చలవిడిగా, విలాసంగా తిరగడం కుదరదనే పెళ్ళి చేసుకోలేదని వినికిడి. ఇంతవరకూ అతని కళ్ళబడ్డ ఏ ఆడదీ తప్పించుకోలేదన్న లోకోక్తి కూడా వుంది. ఇవన్నీ తెలిసిన ఆరతికి మేనేజర్ గదిలో కెళ్ళాలంటేనే వణుకు పుట్టేది. కానీ తప్పదు. రోజుకి పదిసార్లన్నా ఆమెని పిల్చి ఎన్నోవిధాలా పీడించే మేనేజర్ని చూస్తే ఆమె శరీరం అసహ్యంతో కుతకుత ఉడికిపోయేది. ఏ రోజుకారోజు ఉద్యోగానికి రాజీనామా ఇవ్వాలన్నంత బాధ, ఆవేశం, చిరాకూ కలిగేది. కానీ వెంటనే తనింటి పరిస్థితి గుర్తొచ్చి ఆ పని విరమించుకునేది. ఇవన్నీ తెలిసిన సాగర్ తనకి తోడుగా నిల్చి, రక్షణ కల్పిస్తానని వాగ్దానం చేస్తున్నాడు.

నిజమే. పెళ్ళి చేసుకుంటే తనకీ చిత్ర హింసలు తప్పుతాయి. ఇద్దరూ కలిసి ఈ సంసార బాధ్యతని మొయ్యవచ్చు. చెల్లాయి పెళ్ళి నాన్న పి.ఎఫ్‌తో చేసేస్తే తమ్ముడి చదువు. తను చూసుకుంటుంది. వాడికి ఉద్యోగం వస్తే నాన్న బాధ్యత వాడే చూసుకుంటాడు. అప్పటి వరకే కదా నాకీ బాధ్యతలు!? అనుకుని ఆనందించింది ఆరతి.. ఇన్నాళ్ళూ తనో నడి సముద్రంలో వున్నట్లు, ఎప్పుడైనా ఒడ్డుకంటూ చేరలేనా? అని దిగులు పడేది. కానీ ఇప్పుడు సాగర్ అనే నావ తనని ఒడ్డుకి చేరుస్తుందన్న ధైర్యం వచ్చింది.

సాగర్ నాన్నతో మాట్లాడతాడు. తమ పెళ్ళికి తండ్రి మాత్రం కాదంటాడా? ఇంతకంటే మంచి సంబంధం నాన్న మాత్రం తేగలడా? నాన్నక్కూడా ఎంత ఆనందంగా వుంటుందీ వార్త! కానీ కట్నం యివ్వకుండా, నయాపైసా పెళ్ళికి ఖర్చు చెయ్యకుండా తనకి ఉదారుడైన అల్లుడు, ఉన్నత భావాలుగల అల్లుడు వస్తోంటే కాదంటాడా?

నేను ఆఫీసులో వుండగా వచ్చి వుంటాడు. నాన్న ఆ శుభవార్త చెప్పడానికే తీరికగా పిల్చాడు అనుకుంది.

ఆనందంతో పరవళ్ళు తొక్కుతోందామె

## ఒలింపిక్ స్ఫూర్తి వంటబట్టని భారత్



వంద కోట్ల కన్నా ఎక్కువ జనాభా కలిగివున్న మన భారత్ గత వంద సంవత్సరాలుగా జరుగుతున్న ఒలింపిక్ క్రీడలలో ఇంతవరకూ గెలుచుకున్న పతకాలు (మెడల్స్) 16 మించలేదంటే ప్రతి భారతీయుడూ గట్టిగా ఆలోచించవలసిన విషయమే. మన ప్రక్కనున్న చైనాదేశం ఒక్కసారి జరిగే ఒలింపిక్స్‌లోనే అన్ని పతకాలు గెలుచుకుంటోంది. మన పరిస్థితికి మూడే కారణాలు సాధారణంగా చర్చలోకి వస్తాయి. మొదటగా, తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంజనీరింగు, డాక్టరు, కంప్యూటరు లాంటి చదువులు చేపట్టేందుకు ప్రోత్సహిస్తారు. రెండవది, మనదేశంలో పెద్ద క్రీడలు ఆడేందుకు తగిన సదుపాయాలు లేవు. మూడవది క్రీడలలో పోటీపడి గెలిచే లక్షణాలు మన జాతి రక్తంలోనే లేవని. ఏది నిజమైనా ప్రస్తుతం గ్రీసులో జరుగుతున్న ఒలింపిక్ క్రీడలకు పంపిన మన జట్టు సంఖ్య 78. వీరు 28 పోటీలలో పాల్గొంటున్నారు. ఈ సంఖ్యకి వీరితో వెళ్ళిన ఆఫీసర్లు, ట్రైనర్లూ, మేనేజర్లూ, మాలీషర్లు వగైరాలని కలిపితే ఇది రెండింతలు పెరగవచ్చు. ఇప్పటివరకూ నడుస్తున్న పోకడలు గమనిస్తే షూటింగ్‌లో రాథోడ్ గెలుచుకున్న రజత పతకము ఒక్కటే మనకు దక్కేట్టున్నది. ఈ నేపథ్యంలో మనదేశం ప్రతిసారీ ఒలింపిక్స్‌లో ఇంత మందిని పంపి ఎందుకు పాల్గొంటున్నట్లు అంటే ఒలింపిక్ లక్ష్యాల ప్రకారం అన్నిదేశాలు క్రీడలలో పాల్గొనటమే కదా ముఖ్యం? వీటిలో గెలుపు ఓటముల ప్రసక్తే లేదు. అయినా, దేశ కీర్తి ప్రతిష్ఠల కోసమైనా శ్రమించక తప్పదు. జపాన్, కొరియా వంటి చిన్నదేశాలు కూడా పతకాల వేటలో ధీటుగా నిలుస్తుంటే, మనదేశం ఎందుకనో వెనకబడిపోతోంది. ఎందుకిలా? అందరూ ఆలోచించాల్సిన విషయమే!

– వి.కె. మోహన్

మనసు. గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి. తండ్రినోట ఆ శుభవార్త వినడానికి తహతహలాడుతోంది మనసు. సిగ్గుతో ఒళ్ళు గగుర్పొడుస్తోంది. తండ్రివైపు సూటిగా చూడలేక తలదించుకుని కూర్చుంది.

"మీ ఆఫీసులో పనిచేసే సాగర్ అన్నతను వచ్చాడమ్మా!" అన్నాడు గోపాలం ఆమె ఊహించినట్లుగానే.

"ఊ" అంది ఆరతి తరవాత విషయం చెప్పమన్నట్లుగా.

"పెళ్ళి విషయం ప్రస్తావించాడు" అన్నాడు.

మళ్ళీ "ఊ" అంది. వివరంగా చెప్పమన్నట్లుగా తండ్రివైపు చూస్తూ.

"అతను అన్నీ చెప్పాడమ్మా! నేనూ అతనితో అన్నీ వివరంగా మన విషయాలన్నీ మాట్లాడాను. అతనెలాంటివాడంటావు? ఆఫీసులో అతనికి ఎలాంటి పేరుంది? మంచివాడేనా?" అన్నాడు ఆమెవైపు చూస్తూ.

ఇటువంటి విషయాలు తండ్రితో మాట్లాడటం ఇదే తొలిసారి. ఆడపిల్ల తనపెళ్ళి గురించి తండ్రితో ఎలా మాట్లాడగలదు? సిగ్గుతో ముడుచుకుపోసాగింది. కానీ చెప్పక తప్పదని నెమ్మదిగా "చాలా మంచివాడు నాన్నా" అంది.

"అతన్ని చూస్తోంటేనే ఆ సంగతి తెలుస్తోందమ్మా! ఆ నెమ్మది, నమ్రత చూస్తుంటే ఎంతో బుద్ధిమంతుడిలాగే కనపడ్డాడు" అన్న తండ్రి మాటలు విన్న ఆరతికి మేఘాలమీద పయనిస్తున్నట్లే అనిపించింది. ఇక తన కష్టాలన్నీ గట్టెక్కి పోయాయనుకుంది. మనసులోనే తండ్రికి ధన్యవాదాలర్పించుకుంది. లేచి నిలబడింది తన గదిలోకెళ్ళడానికి.

"లేచావేం? కూర్చో ఆరతీ!" అన్నాడు ఇంకా ఏదో చెప్పాలన్నట్లుగా.

"పడుకో నాన్నా! బాగా పొద్దుపోయింది" అన్న ఆరతి మాటల్ని పూర్తి కానివ్వకుండానే "అది కాదమ్మా! నేనొకటి అనుకుంటున్నానూ..." అని ఆగిన తండ్రివైపు ప్రశ్నార్థకంగా చూస్తూ నిలబడింది.

"చూడమ్మా ఆరతీ! నా పరిస్థితే ఇలాగుంది. ఇహనో, రేపో, ఎప్పుడో తెలియని రోగం నాది. భారతికా చదువు అబ్బలేదు. ముందుగా దాని పెళ్ళి చేసేసి నువ్వు చేసుకుంటే బాగుంటుందమ్మా!" అన్న తండ్రి మాటలకి బిత్తరపోయింది. కొంచెం సేపు మౌనం వహించి తరువాత "అలాగే చేద్దాంలే నాన్నా" అంది ముక్తసరిగ.

"అది అలా ఇంట్లో కూర్చుంటే మనకీ భారమే. ఆ భారాన్ని దింపేసుకుంటే మాధవ్ చదువు వుంటుంది. అదీ గట్టెక్కుతే నీపైనున్న మా భారం తగ్గుతుంది. ఈ రోజుల్లో ఎన్నేళ్ళ పెళ్ళికొడుకులైనా దొరుకుతున్నారు. ఉద్యోగం చేసుకుంటున్న వాళ్ళకి పెళ్ళవడం కష్టం కాదు. భారతి పెళ్ళే మనకి సమస్య. చదువా అబ్బలేదు. పెద్ద కట్నమా ఇవ్వలేము. ఇప్పుడు నీ పెళ్ళి ముందయితే దాని పెళ్ళి జరగడం కష్టమే! వాడి చదువూ పూర్తవడం కష్టమే! మనం అనుకున్నవన్నీ జరగవు తల్లీ! పెళ్ళికి ముందు చేసే వాగ్దానాలు వేరు. పెళ్లయ్యాకే స్వార్థం వీటన్నింటికీ అడ్డుతగిలి, ఆ వాగ్దానాల్ని మరిపింప జేస్తుందమ్మా! నీకింకా చిన్నతనం. అనుభవం తక్కువ. నేను యిలాంటి వెన్నో చూసాను. ఎన్నో విన్నాను. అందుకే చెప్తున్నాను. కాస్త నిదానంగా ఆలోచించు. నేనూ సాగర్‌తో అన్ని వివరంగా చెప్పాను. ఆఖరిగా అతడిని అర్థించేదేమిటంటే మా భారతి భారాన్ని నీ మీద వేసుకుని మా ఆరతికి, నాకూ సహాయపడమని ప్రాధేయపడ్డాను. అతను ఆరతితో మాట్లాడతానని వెళ్ళాడు. మరి అతడిని ఒప్పించడం నీచేతుల్లోనే వుందమ్మా! భారతిని పెళ్ళి చేసుకోమని చెప్పే బాధ్యత నీదే తల్లీ! నన్నర్థం చేసుకో అమ్మా! స్వార్థపరుడిననుకోకు. నువ్వు కూతురివైనా కొడుకులా ఆదుకుని ఈ యింటిని నెట్టుకొస్తున్నావన్న సంగతి అందరికీ తెలుసు. బాగా ఆలోచించుకుని నిర్ణయం తీసుకో! వెళ్ళి పడుకో ఆరతీ!" అంటూ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని ఆప్యాయంగా నిమిరి వదిలిపెట్టాడు గోపాలం.

తండ్రి మాటలకి తల తిరిగి పోయింది ఆరతికి. నెమ్మదిగా లేచి తన గది వైపుకి నడిచింది. దుఃఖంతో గుండె బరువెక్కి పోయింది. ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టడం లేదు. ఆలోచనలతో తల బద్దలవుతోంది. తండ్రి చెప్పిందంతా నిజమోనేమో అనిపిస్తోందొక్కోసారి. కానీ తను వివాహం చేసుకోవాలనుకున్న సాగర్‌ని ఇప్పుడు చెల్లెల్ని చేసుకోమని అడగాలంటేనే అదోలా అనిపిస్తోంది. ఇంతకీ సాగర్ అభిప్రాయమేమిటి? నిజంగా నన్ను ప్రేమిస్తున్నాడా? లేక నా పరిస్థితుల్ని చూసి జాలిపడుతున్నాడా? నా కుటుంబానికి అండగా ఎందుకుంటానంటున్నాడు?

నాన్నలోనూ ఎంత స్వార్థం వుంది! ఆయన మాటల్లో నా మీద అపనమ్మకంతోపాటు, చెల్లాయి, తమ్ముడి మీద తనకంటే అధికప్రేమ. జాలి స్పష్టంగా వెల్లడవుతోంది. లేకపోతే ఎందుకలా మాట్లాడతారు? వాళ్ళ మంచి చెడ్డల గురించి ఆలోచించినంత లోతుగా నా గురించి ఆలోచిస్తున్నారా? ఎంత వయసు పెళ్ళికొడుకులన్నా దొరుకుతారు. ఉద్యోగం చేసే నీకు పరవాలేదనడంలో నాన్న

## పుస్తకాలు

## దళిత కథామంజరి

***దళిత కథామంజరి హృదయంగమ లహరి***
***అస్పృశ్యతా నివారణ కవతరించిన ఝరి.***

డా॥ బి.వి.ఎస్. మూర్తిగారి మానస వీణా నాదమునకు పరవశించి బయలదేరిన మయూరి. విశ్వమానవ సోదరభావమును చాటుటకరుదెంచిన మనోహరి. అరుంధతితో ఆరంభించి లక్ష్మమ్మతో ముగించిన లక్షణము మెచ్చదగినది. దళితులనబడువారు దయనీయ స్థితిలో క్రుంగి క్రుశించి బాధ పడుట తగదని, మనదేశ చరిత్రలో, మన పురాణాలలో మహనీయులై పూజింపబడు వారిలో దళితులు దండిగా ఉన్నారని ధైర్యం చెబుతున్నారు కవిగారు.

పురుషులు, స్త్రీలు అను తారతమ్యము లేక దళితులలో అనేకులు అగ్రస్థానములు పొంది, ధన్యులై, పరమపావనులై, పరమాత్మునిలో లీనమైనారని ఉదాహరణలతో వివరించిన కథాగుచ్ఛమిది.

భగవంతునిపై భక్తితో, రాజకీయ శక్తితో, తరతరాలుగా చేయు వృత్తిలో దళితులు కూడా ప్రశంసలు పొందారని, పొందుతున్నారని, పొందగలదని, వారికి కూడా పూజ్య స్థానము లభించగలదని, ఈ కథల ద్వారా కవిగారు ఎంతో చక్కగా వివరించారు. **– విద్వాన్ శాంతకుమార్**

ఉద్దేశ్యం?? ఒక్కనాడన్నా తన్ని కూర్చోపెట్టుకుని తన కష్టసుఖాలుగానీ, ఆఫీసు విషయాలుగానీ అడిగారా? ఇల్లు ఎలా నడుస్తోందని ఆలోచించారా? కనీసం నీకు బట్టలున్నాయా? అనయినా ఒక్కరోజు అడగని తండ్రి, భారతి బట్టల గురించి, తమ్ముడి ఫీజు, పుస్తకాల గురించి పాకబు చేస్తారే! మరి నాన్నలో ఇంత భేదం ఎందుకొచ్చింది? నేను మాత్రం కూతుర్ని కానా? భారతి పెళ్ళి గురించి ఆయనకున్న దిగులు వ్యక్తం చేస్తుంటే కంఠం రుద్ధమయి, కళ్ళంట నీళ్ళు రావడం చూసి నా మనసూ ఆర్ద్రమయి "నాన్న చెప్పింది నిజమే" అనిపించింది. నా గురించి అలా ఆలోచించేదెవరు?

మరి సాగర్ అభిప్రాయమేమిటో? సానుభూతితో మా కుటుంబాన్ని ఆదుకునే ఉద్దేశ్యమయితే అభ్యంతరం చెప్పదు. రేపు అతన్ని కదిపి చూసి అతని మాటల్ని బట్టి ముందు ఏం చెయ్యాలన్నది ఆలోచించాలి అనుకుంటూ కళ్ళు మూసుకుంది ఆరతి.

మర్నాడు ఆఫీసులో ఎదురైన సాగర్ ఆరతిని మామూలుగానే పలకరించాడు. లంచ్ టైములో తప్ప అతనితో మాట్లాడే అవకాశం చిక్కలేదు. ఇద్దరూ ఆఫీసు బైటికెళ్ళి పక్కనే వున్న హోటల్లో ఓ మూలగా కూర్చున్నారు. సాగర్ రెండు కాఫీలు ఆర్డర్ చేశాడు.

ఆరతి ఆఫీసుకొచ్చిన దగ్గర నుంచీ సాగర్నే గమనిస్తోంది. అతనిలోని భావాలని చదవాలని తాపత్రయపడుతోంది. అతనిలో ఏ మార్పులేదు. మౌనంగా కూర్చున్న సాగర్ని చూసి ఆరతే అడిగింది. "నిన్న మా నాన్నతో మీరు మాట్లాడారటగా?"

"అవును" అన్నాడు ముక్తసరిగా.

"నాన్న అన్నీ చెప్పారుటగా? మరి మీ అభిప్రాయం ఏమిటి?" అంది మళ్ళీ ఆరతే.

"అదేమిటి ఆరతీ! నిన్ను చేసుకోవాలనుకుని మీ నాన్నతో మాట్లాడాలని వెళ్తే ఆయన మీ చెల్లెల్ని చేసుకోమని బ్రతిమాలుతారేమిటి? ఆయన తన రోగం, కొడుకు చదువు భారతి గురించి చెప్పుకు బాధపడుతుంటే నిజంగా నా గుండె జాలితో నిండిపోయింది. ఆయన దగ్గర ఇంకేం మాట్లాడలేక నీతో మాట్లాడతానని లేచొచ్చేసాను. ఆరతీ! నా కిప్పుడేం చెయ్యాలో తెలీటం లేదు. నేనింక ఆయనతో మాట్లాడి ప్రయోజనం వుండదు. నువ్వే మీ నాన్నకి నచ్చజెప్పి మన పెళ్ళి అయ్యేలా చూడు." అన్నాడు.

"మా చెల్లెల్ని చూశారా?" అంది అతన్నే పరీక్షగా చూస్తూ.

ఎదురుచూడని ఈ ప్రశ్నకి తెల్లబోయి ఆరతివైపు చూస్తూ "ఊ" అన్నాడు.

"పోనీ మా చెల్లినే చేసుకోకూడదూ?" అంది తలదించుకుని.

"ఆరతీ!" అన్న అతని పిలుపుతో తలెత్తి అతన్ని చూసిన ఆమె నయనాలు అశ్రు పూరితాలయి వుండడం చూసిన సాగర్ మాటలు రానివాడిలా వుండి పోయాడు. కాస్సేపటికి తేరుకుని ఆరతే సాగర్ని మళ్ళీ పలకరించింది. "నిజమే సాగర్! రాత్రల్లా ఆలోచించాను. నాన్న చెప్పిన మాటల్లో యదార్థం లేకపోలేదు. ఒక్కసారి ఆలోచించండి. నాకు పెళ్ళవడం కష్టం కాదు. నా చెల్లెలికి చదువుతక్కువ, మాకు కట్నమిచ్చే తాహతులేదు. పెళ్ళి ఖర్చు కూడా వద్దనే మీలాంటి ఉదారుడు దొరకడు. మమ్మల్ని అర్థం చేసుకున్న మీవంటివాడు మా నాన్నకి అల్లుడిగానూ, మా చెల్లికి భర్తగానూ దొరకడం చాలా కష్టం. మీకు అభ్యంతరం లేకపోతే మా చెల్లెల్ని చేసుకోండి సాగర్! నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను. ఇది త్యాగం కాదు. నేను మనస్ఫూర్తిగా అభ్యర్థిస్తున్నాను. మా భారతిని చేసుకుంటే మా కుటుంబానికి ఎంతో సహాయపడినవారవుతారు. మీ ఋణం జన్మ జన్మలకీ తీర్చుకోలేం సాగర్! ఒక్కసారి ఆలోచించుకోండి. నా నిర్ణయం విన్నారు. ఇంక మీరే చెప్పాలి" అంది తాగిన కాఫీ కప్పుని ప్లేటులో పెడుతూ.

"ఆరతీ! నువ్వేనా ఈ మాటలంటున్నది! ఏమిటి? నీకు ఏమన్నా పిచ్చిగానీ ఎక్కలేదు కదా? నన్నెందుకిలా ఇరుకులో పెడుతున్నావు? మీ కుటుంబం యందు జాలీ, దయా, సానుభూతి వున్న మాట వాస్తవమే. కానీ వాటితోపాటు నీమీదుండే ప్రేమవల్లే నీ బాధ్యతలన్నీ పంచుకోవాలనుకున్నాను. మీ చెల్లెల్ని చేసుకుని మీ కుటుంబానికి సహాయపడాలని మాత్రం కాదు. దయచేసి మీ నాన్నగారికి మన గురించి వివరంగా చెప్పి, అంగీకరించేలా చెయ్యి. ఇంక నన్ను ఆ విషయమై వేధించకు ఆరతీ!" అంటూ ఆమె చేతుల్ని పట్టుకుని ప్రాధేయపడసాగాడు సాగర్.


"సాగర్ మీరు చెప్పిందంతా నిజమే! కానీ మన ఆలోచనలు మనకి రైటనిపించినట్లే నాన్నకీ తనవి రైటనిపించొచ్చుగదా! దానికి తోడు ఆయనకి ఇంటి యజమానిగా బాధ్యత, అధికారం కూడా వున్నాయి. ఆయన మాటని కాదంటే ఆయన్ని అగౌరపరిచామని, నిర్లక్ష్యం చేసామని బాధ పడతారు. అందుకే మా చెల్లి పెళ్ళి మా తమ్ముడి చదువూ అయ్యేవరకూ నేను పెళ్ళి చేసుకోదల్చుకోలేదు. మా నాన్న అభిప్రాయం తెలుసుకున్నాకే నా నిర్ణయం మారిపోయింది. నామీదున్న ప్రేమని మర్చిపోయి, మా పట్లవున్న జాలి, దయా, సానుభూతినీ మా కుటుంబానికి ధారపోసి మా చెల్లెల్ని భార్యగా స్వీకరిస్తే మా కుటుంబం మీకు ఎంతో ఋణపడివుంటుంది. ప్లీజ్ ఒక్కసారి మళ్ళీ ఆలోచించుకోండి. భారతి చక్కగా వుంటుంది.

## పాకిస్తాన్ సినిమాలో కత్రీనాకైఫ్!

ఎన్నారై సుందరి కత్రీనాకైఫ్ ఓ పాకిస్తాన్ సినిమాలో నటించబోతోంది. భారతీయుడే ఈ సినిమాకి హీరోగా



నటించనున్నప్పటికీ ఎవరనే విషయం మాత్రం ఇంకా తేలలేదు. సల్మాన్‌ఖానే కావచ్చున్నది బాలీవుడ్ బోగట్టా! 'కోయి ప్యార్ నా కరే'గా టైటిల్ నిర్ణయించిన ఈ సినిమాకి కత్రీనాకి బాగానే పారితోషికం ముట్టిందట!



# వ్యాయామం చేసే ముందు ఈ జాగ్రత్తలు అవసరం

వ్యాయామం మాట చెబితేచాలు కొందరు ఎక్కువగా ఊగిపోతారు. జిమ్‌కో, గ్రౌండ్‌కో వెళ్తారు. కానీ వారం తిరగక ముందే బెణుకులు, నొప్పులంటూ డీలా పడి పోతారు. వ్యాయామం పట్ల సరైన అవగాహన లేకపోవటం వల్లే ఇలా గాయాల బారిన పడటం, నొప్పుల పాలవటం జరుగుతుంటుంది. ఇక ఆ తర్వాత మళ్ళీ జిమ్ ముఖం చూడరు. దాని వలన ఒక మంచి ప్రయత్నం కాస్తా మొదట్లోనే నీరుగారి పోతుంది. జిమ్‌కు వెళ్ళినప్పుడు అక్కడ పరికరాల్ని సరైన పద్ధతిలో ఉపయోగించాలి. అన్నిరకాల జాగ్రత్తలూ తీసుకోవాలి. సాధారణంగా చాలామంది చేసే పొరపాట్లు ఇలా ఉంటాయి.

※ చాలామంది వ్యాయామానికి ముందు సరైన విధంగా 'స్ట్రెచింగ్' చెయ్యరు.

※ అత్యుత్సాహంతో శక్తికి మించిన బరువులెత్తుతారు.

※ ఏరోబిక్ ఎక్సర్ సైజులు చేసే ముందు దానికి అవసరమైన వామప్స్ చెయ్యరు.

※ తీవ్రమైన వ్యాయామం చేస్తారుగానీ ఆ తర్వాత అవసరమైనంత విశ్రాంతి తీసుకోరు.

※ శక్తికి మించి తీవ్రంగా కఠినతరమైన వ్యాయామం చేస్తారు.

※ వ్యాయామం చేసే ముందు, చేస్తున్నప్పుడు తగినంతగా మంచినీరు తాగరు.


※ పరికరాలను తెలిసీ తెలియకుండా అడ్డదిడ్డంగా వాడతారు.

※ ఎక్సర్‌సైజుల్ని ఒక క్రమంలో కాకుండా గుర్తుకు వచ్చినవి వచ్చినట్టు చేసుకుపోతుంటారు.

※ బరువులెత్తేటప్పుడు విపరీతంగా జర్కులిస్తారు.

※ వ్యాయామం చేస్తున్నామన్న సాకుతో అతి బలవర్ధకమైన ఆహారం, హై క్యాలరీ స్పోర్ట్స్ డ్రింకులు తాగుతుంటారు.

– డి. చందూవంశీ



దాని పెళ్ళి మాకు సమస్యే. అదయిపోతే నాన్నకి బెంగ తీరిపోతుంది" అంటూ అతని చేతులు పట్టుకుని బ్రతిమాలసాగింది.

"నాకు కొంచెం టైమివ్వు ఆరతీ! ఆలోచించుకుని చెప్తాను" అంటూ లేచాడు. వెనక ఆరతి కూడా నడిచింది.

పట్టు విడవని ఆరతి సాగర్‌ని ప్రతిరోజూ భారతిని పెళ్ళిచేసుకోమని అడుగుతూనే వుండేది. ఆఖరికోరోజు అతని చేత "సరే"నని పించింది. ఒక శుభముహూర్తాన గుడిలో వాళ్ళ పెళ్ళి జరిపించి, వేరే ఇంట్లో కాపురం పెట్టించి, అక్కగా తను ఇవ్వగలిగింది ఇచ్చి తన బాధ్యతని తీర్చుకుంది. ఆ దంపతులిద్దరూ తనికి దణ్ణం పెడుతున్నప్పుడు వారిద్దర్నీ చూసి మనస్ఫూర్తిగా ఆనందించి "ఒక బాధ్యత తీరింది" అనుకుంది.

ఇంటికి వచ్చిన ఆరతిలో ఏదో వెల్తి, ఏదో పోగొట్టుకున్నట్లు బాధ. 'నాదీ' అనుకున్న వస్తువుని ఎవరికయినా దానం చేసినా అలాంటిదే మరొకటి కొనుక్కోవచ్చు. కానీ ప్రేమని మాత్రం రక్త సంబంధీకులకైనా అర్పిస్తే కలిగే బాధ ఎటువంటిదో త్యాగం చేసే వరకూ తెలిసిరాలేదు ఆరతికి. ప్రేమించిన వ్యక్తి, తనకి దూరం అయ్యాక కలిగే బాధ వర్ణనాతీతం. ఒకరితో చెప్పుకోలేని వ్యధ, చెప్పినా తనని హర్షించేవాళ్ళూ, ఊరడించేవాళ్ళూ ఎవరు?

ఇన్నాళ్ళూ తన బాధల్ని చెప్పుకుని కాస్త ఉపశమనం పొందేది ఒక్క సాగర్ దగ్గరే! కానీ ఇప్పుడు అతనూ తనకి పరాయివాడే! పరిస్థితులు తనచేత అలా చేయించాయి. ఏదన్నా మాటల్లో చెప్పడం తేలికే! ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన బాధేమిటో తెలిసేది అనుకుని ఓ పక్క బాధపడుతున్నా మరోపక్క రోగిష్టి తండ్రి ముఖంలోని ఆనందాన్ని చూసి తృప్తిపడింది.

"ఆరతీ! తల్లిలేని భారతికి తల్లిలా నిలబడి ఆ లోటు తీర్చావమ్మా!" అని తండ్రి అంటుంటే ఓ పక్క ఆనందం, మరోపక్క బాధా పెల్లుబికి వచ్చాయి. "నాకూ తల్లి లేదు కానీ నాకాలోటు తీర్చేదెవరు?" అని మనస్సునే ప్రశ్నించుకుంది. తండ్రి మాటలు వింతగా అనిపిస్తాయి ఆరతికి.

ఆరతి జీవితనౌక పాత బాటలోనే ఒడిదుడుకుల్ని ఎదుర్కొంటు సాగిపోతోంది. భారతీ, సాగర్‌ల కాపురం హాయిగా సాగిపోతోంది. ఇంట్లో తమ్ముడు తన చదువు తప్ప మరే విషయాన్నీ పట్టించుకోడు. తండ్రి రోగం మామూలే! యాంత్రికంగా ఆఫీసుకెళ్ళి వచ్చేది. ఆఫీసులో సాగర్‌తో లోకాభిరామాయణం మాట్లాడుతూ తన కష్టాలని మర్చిపోయి తిరిగేది. (మిగతా వచ్చే సంచికలో)